క్లుప్తంగా

జాతీయ యోగా పోటీలకు వెంకటేష్



భీమునిపట్నం: భీమిలికి చెందిన కనకల వెంకటేష్ జాతీయ సీనియర్ యోగా పోటీలకు ఎంపికయ్యారు. కీతిన్‌పేట వద్దనున్న జిమ్‌లో కోచ్ నల్లా శ్రీనివాసరావు వద్ద శిక్షణ పొందిన వెంకటేష్ ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 19 నుంచి 23 వరకు హంగ్రీలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా వెంకటేష్‌ను కోచ్ శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట అంబేడ్కర్ కాలనీలోని శ్రీ సీతారాములు, షిర్డీ సాయి, ఉమా రామలింగేశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఈ నెల 17 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయ అర్చకుడు బూరాడ కామేశ్వరశర్మ, దార్లపూడి కైలాసరావు శర్మ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాల్లో చివరి రోజైన 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

పాడి రైతులకు దుప్పట్ల పంపిణీ



మద్దిలో పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా విశాఖ డెయిరీ పని చేస్తోందని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని మద్ది పాల ఉత్పత్తి దారుల సంఘం కార్యాలయంలో విశాఖ డెయిరీ తరఫున 383 మంది పాడి రైతులకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సుఖీభవ కార్డులున్న రైతులకు ఈ దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మద్ది పాల ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు కనకల ప్రకాష్, బాందేవుపురం కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కనకల ప్రకాష్ పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



తాడు సహాయంతో లారీని లాగుతున్న దృశ్యం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రుషికొండ ప్రధాన రహదారి సమీపంలో శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. ఆ ప్రాంతంలో ప్రేమ సమాజానికి సంబంధించిన స్థలం చదును చేయడంలో భాగంగా ఓ లారీతో శుక్రవారం మట్టిని తీసుకుని వచ్చి నింపుతున్న సమయంలో బ్రేక్ ఫెయిల్ కావడంతో, దాని పక్కనే ఉన్న గెడ్డ వాగులోకి లారీ దూసుకుపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొంతమంది యువకుల సహాయంతో లారీని లాగినా ప్రయోజనం లేకపోవడంతో, మరో వాహనం సహాయంతో ఎట్టకేలకు లారీని బయటకు తీశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

తగరపువలస: ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వస్తువుల నాణ్యత, ధర, ప్రామాణికత తదితర వివరాల గురించి హెచ్‌ఎం రెడ్డిపల్లి అప్పలరాజు వివరించారు.

1989 మార్చి 15న భారత ప్రభుత్వం వినియోగదారుల దినోత్సవం గురించి ప్రకటించిందన్నారు. బులెటిన్లు, పీరియాడికల్స్, కరపత్రాలు, పోస్టర్ల దారా వినియోగ పరిజ్ఞానాన్ని పెంచి అందరికీ చైతన్యం కలిగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

- పార్కుల అభివృద్ధిపై ప్రజల హర్షం
- 7వ వార్డులో సందడిగా ఓపెన్ జిమ్‌లు



చంద్రంపాలెం సమీప భరత్‌నగర్ పార్కులో వ్యాయామం చేస్తున్న మహిళలు

మధురవాడ: ఏళ్లుగా అధ్వానంగా పార్కులు ఇప్పుడు కళకళలాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన పార్కుల ఆధునికీకరణతో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని అందిస్తున్నాయి. జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీకి వెళ్లే రోడ్డులో శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్–చంద్రంపాలెంలను ఆనుకుని ఉన్న భరత్‌నగర్, పోర్టు కాలనీ, స్వతంత్ర నగర్, తదితర ప్రాంతాలు ఉన్నాయి. ముఖ్యంగా భరత్‌నగర్ హైవేకు దగ్గరలోనే ఉన్నా శివారు ప్రాంతం కావడంతో ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోలేదు. కనీసం సరైన రోడ్డు కూడా లేదు. దీంతో నాయకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక నాయకులు అభివృద్ధిపై దృష్టి సారించారు.



స్పోర్ట్స్ థీమ్ పార్కులో ఆకట్టుకుంటున్న కళాఖండం

అభివృద్ధి ఇలా..

నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు–వాంబే కాలనీ కనెక్టింగ్ రోడ్డు నుంచి బీటీ రోడ్డు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉన్న రెండు పార్కులకు రక్షణ చర్యలు చేపట్టారు. ఓ పార్కులో ఓపెన్ జిమ్ సామగ్రి ఏర్పాటు చేశారు. స్థానికులు ఉదయం, సాయంత్ర వేళల్లో ఇక్కడ వ్యాయామం చేస్తున్నారు.

- సుమారు రూ.16 లక్షల వ్యయంతో కాలువలు, రోడ్ల నిర్మాణానికి కూడా గత ఆదివారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. పనులు కూడా ప్రారంభమయ్యాయి.
- స్వతంత్రనగర్‌లో రూ.2.50 కోట్లతో మరో భారీ పార్కు కూడా అందుబాటులోకి వచ్చింది. ఇలా భరత్‌నగర్, పోర్టు కాలనీ, స్వతంత్రంనగర్ పరిసర ప్రాంతాల వాసులకు పలు పార్కులు అందుబాటులోకి రావడంపై ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.



స్వతంత్రనగర్ పార్కులో కళాఖండాలు

వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి



ఇక్కడ పదేళ్లకు పైగా ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నాం. కనీసం ఇక్కడ రోడ్డు కూడా ఉండేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఇక్కడ రోడ్డు వేశారు. పార్కు అభివృద్ధి చేశారు. చాలా ఆనందంగా ఉంది.

– శివ కల్యాణి, అపార్ట్‌మెంట్ నివాసి, భరత్‌నగర్

ప్రభుత్వానికి ధన్యవాదాలు



చంద్రంపాలెంలోని ఫ్లాట్‌లో ఉంటున్నాం. గతంలో ఇక్కడ రోడ్లు, పార్కులు లేవు. ఈ ఏడాదిన్నర కాలంలోనే రోడ్లు వేశారు. పార్కులు అభివృద్ధి చేశారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు. పార్కు, ఓపెన్ జిమ్ మహిళలతో పాటు పురుషులకు చాలా బాగా ఉపయోగపడుతున్నాయి.

– జగదీష్‌కుమార్, చంద్రంపాలెం

సీఎం జగన్ పాలనలో అందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- జలజీవన్ మిషన్ మంచినీటి పథకాలకు శంకుస్థాపన



జలజీవన్ మిషన్ మంచినీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆనందపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పార్టీలకతీతంగా అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శొంఠ్యాంలో రూ.87 లక్షలతో, కుసులువాడ పంచాయతీ రేగాని గూడెం, ఇచ్చాపురం, ఎస్సీ కాలనీల్లో రూ.75 లక్షలతో ఏర్పాటు చేయనున్న జలజీవన్ మిషన్ పథకాలకు, శిర్లపాలెంలో రామాలయం నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నిజాయితీగా, నిష్పక్షపాతంగా సాగిందన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గ్రామ స్వపరిపాలన కొత్త పుంతలు తొక్కిందన్నారు. అన్ని సమస్యలకు స్థానికంగా పరిష్కారం చూపే సంజీవనిలా సచివాలయ వ్యవస్థ పని చేస్తోందన్నారు. పేదలు బాగు పడాలన్నా, అవినీతి లేని పాలన కావాలన్నా మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంను చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నీలం అప్పలనాయుడు, సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి, భీమిలి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బోని అప్పలనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ దుర్గాంబ, జేఈ మూర్తి, నాయకులు లెంక రాంబాబు, కోరాడ వెంకట రమణారావు, రౌతు శ్రీను, బి.ఆర్.బి.నాయుడు, షిణగం అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం



విద్యార్థులకు మొక్కలు అందిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పంచాయతీలో వారం రోజుల పాటు ఏర్పాటు చేసిన శిబిరం శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు విద్యార్థులు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నారు. వారం రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సన్యాసినాయుడు, కె.వెంకటరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ బి.ఎస్. వెంకటరెడ్డి, రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు, డైరెక్టర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



ఇంటి పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ చిల్లపేట, బాలాజీనగర్ వార్డు సచివాలయాలలో శుక్రవారం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి పట్టాలను వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. చిల్లపేటలో జరిగిన కార్యక్రమంలో రెండోవార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో 110 మందికి ఈ పట్టాలు అందించారు. ఆయన మాట్లాడుతూ ఒక్కొక్కరికి రూ.5 లక్షల విలువైన ఇంటి స్థలం, రిజిస్ట్రేషన్, యూజర్ చార్జీలు రూ.8,858 కలిపి ప్రభుత్వమే భరించి ఉచితంగా అందించిందన్నారు, రానున్న ఎన్నికలలో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలవాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రాము, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు బింగి హరికిరణ్‌రెడ్డి, సీనియర్ నాయకులు జీరు వేణుగోపాలరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, చిల్ల సూరి నరసయ్యరెడ్డి, నేదూరి శ్రీనివాసరెడ్డి, డెక్కతి శ్రీనివాసరెడ్డి, చిల్ల సూరిబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు. బాలాజీనగర్ సచివాలయంలో ఒకటో వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రాము నాయుడు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు.




పాత పీఎంపాలెంలో పట్టాలు పంపిణీ చేస్తున్న పోతిన శ్రీనివాసరావు

పీఎం పాలెంలో పట్టాల పంపిణీ

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు పాత పీఎం పాలెం 52వ సచివాలయ పరిధిలో పేదలకు సెంటు స్థలం ఇళ్ల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను ఏపీ నగరాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉండి, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు.

ఓపెన్ స్కూల్ విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ



హాల్ టికెట్లు అందుకున్న ఓపెన్ స్కూల్ విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం, అన్నవరం, చిప్పాడ పంచాయతీలలో డ్రాపవుట్ విద్యార్థులను దివీస్ యాజమాన్యం ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలకు పంపించనుంది. అందులో భాగంగా 15 మంది పదో తరగతి, 18 మంది ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నాయి. వీరికి మెటీరియల్, తదితరాల కోసం దివీస్ రూ.28 వేలు ఖర్చు చేసింది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు శుక్రవారం దివీస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో హాల్ టికెట్లు పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో దివీస్ సీఎస్ఆర్ ప్రతినిధులు డి.సురేష్‌కుమార్, ఎ.శ్రీనివాస్, కె.నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనులకు వినతి

తగరపువలస: భీమిలి జోన్ రెండో వార్డు రాజలింగంపేట, డెక్కతిపాలెం గ్రామాల శ్మశానవాటికలో అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరుతూ ఇరు గ్రామాల పెద్దలు జెడ్సీ కనకమహలక్ష్మికి శుక్రవారం వినతి పత్రం అందించారు. వందేళ్లుగా రెండు గ్రామాలకు ఒకే శ్మశానవాటిక ఉన్నందున ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో శిల్లా వంశీరెడ్డి, బోర వెంకటఅప్పారావు, కొండపు సూరిబాబు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాల కేటాయింపు

తగరపువలస: పద్మనాభం మండలంలో నాగవంశీయులకు, మధురవాడలో నగరాల సామాజిక వర్గాలకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి 50 సెంట్ల చొప్పున స్థలం పరిశీలించి కేటాయించాలని సీఎంవో కార్యాలయం నుంచి కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి. ఈ నెల 7న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనకాపల్లి జిల్లాకు పర్యటనకు వచ్చినప్పుడు నగరాలు, నాగవంశం సామాజికవర్గాల కల్యాణ మండపాలకు స్థలాలు కేటాయిచాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి వినతిపత్రాలు అందించారు. దీనిపై ఆ సామాజికవర్గాలకు చెందిన నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ



పద్మనాభంలో ర్యాలీ నిర్వహిస్తున్న వీవోఏలు

పద్మనాభం: పోషన్ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.ఉమాజానకి, వీవోఏలు, విలేజ్ హెల్త్ పాయింట్ పర్సన్లు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్కులో కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

తగరపువలస: సంతపేట ప్రాథమిక పాఠశాల వెనుక సత్యనారాయణస్వామి కొండను ఆనుకుని ఉన్న చిల్డ్రన్స్ పార్కు ప్రాంతంలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని 1,2 వార్డులకు చెందిన ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం రెడ్డి, కుమ్మరి, యాదవ, రజక, పద్మశాలీ సామాజిక సంఘాల ప్రతినిధులు భీమిలి జెడ్సీ కనకమహలక్ష్మికి వినతి పత్రం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో మాజీ కౌన్సిలర్లు చేట్ల ఎల్లయ్యరెడ్డి, పిట్ట వెంకటరావు, చేట్ల రమణ, చేట్ల అన్నపూర్ణ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉత్తమ ఫలితాలు

పీఎం పాలెం: ఉద్యోగ నిర్వహణలో నైపుణ్యం ఉన్నవారు ఉత్తమ ఫలితాలు సాధించగలరని ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ బీవీఆర్ గుప్తా అన్నారు. స్థానిక సాంకేతిక విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉద్యోగ నిర్వహణలో నైపుణ్యం కనబరిచిన వారు తాము పని చేస్తున్న సంస్థకు పూర్తి న్యాయం చేకూర్చగలరని, అటువంటి వారినే యాజమాన్యాలు కోరుకుంటున్నాయని వివరించారు.

వాంబే కాలనీలో వ్యక్తి ఆత్మహత్య

పీఎం పాలెం: జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక ప్రాంతానికి చెందిన పవన్ (32) తల్లి లక్ష్మితో కలిసి ఏడాది నుంచి వాంబే కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. తల్లి లక్ష్మి కూలి పనులకు వెళ్తుంది. పవన్ మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో పవన్‌ను ఇంట్లో వదిలి, తల్లి వేరే ఊరు వెళ్లింది. దీంతో అతడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు బలవంతంగా తలుపులు తెరిచి చూడగా, పవన్ ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి పరిస్థితిని బట్టి మూడు రోజుల క్రితమే అతడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా సీఎం జగన్ ధ్యేయం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- రూ.2.55 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం



సబ్ స్టేషన్ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

తగరపువలస: లో ఓల్టేజీ లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఈ అయిదేళ్లలో అదే విధంగా సేవలు అందించారన్నారు. భీమిలి రోడ్డు సంతపేటలో రూ.2.55 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శుక్రవారం ఆయన శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాపులుప్పాడ, ఐటీ సెజ్‌కు ఉపయోగపడేలా రూ.7.99 కోట్లతో నిర్మించిన సబ్ స్టేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. మధురవాడ సుద్దగెడ్డ వద్ద మరో రూ.3 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయన్నారు. వేసవిలోనూ నిరంతర విద్యుత్ సరఫరా, రైతులకు పగటివేళ నాణ్యమైన సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్సీ కనకమహలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్, జోన్–3 డీఈ పోలాకి శ్రీనివాసరావు, భీమిలి డీఈఈ రౌంగలి రమేష్, చిట్టివలస సబ్‌స్టేషన్ ఏఈఈ బొట్టా రవి, ఏఎంసీ చైర్మన్ వై.సూర్యనారాయణ, కార్పొరేటర్ డి.ఏడుకొండలు, కో–ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు జీరు వెంకటరెడ్డి, జీవీ రమణ దబ్బీరు ప్రశాంతి, చిల్ల గణేష్‌రెడ్డి, చిల్ల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై వినతి



మధురవాడలో వినతి పత్రం స్వీకరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

మధురవాడ: దివ్యాంగుల సమస్యలుపై దివ్యాంగుల హక్కుల సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎం.సురేష్ మీనన్ వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. శుక్రవారం మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్‌లోని కార్యాలయంలో కలిసి పలు సమస్యలు వివరించారు. దివ్యాంగుల పెన్షన్ రూ.3వేలు నుంచి రూ.10 వేలుకు పెంచాలని, కేజీ నుంచి పీజీ విద్యను ఉచితంగా అందించాలని, అన్ని రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఆనందపురం : తర్లువాడ పంచాయతీ ప్రకృతివాని పాలెంలో శుక్రవారం సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ బి.ఆర్.బి.నాయుడు, మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షల కేటాయించారు. ఈ కార్యక్రమంలో పలపాల రమణ, రోమాల శ్రీను, ఉరుకూటి పేరయ్య, కొల్లి కనకరాజు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం



రోగికి జగనన్న సురక్ష కేస్ షీట్‌ను అందిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

ఆనందపురం : గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా పేదలందరికీ ఉచిత వైద్యం అందుతోందని డీఎం అండ్ హెచ్‌వో పి.జగదీశ్వరరావు చెప్పారు. గొట్టిపల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 324 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి బి.ఉమావతి, వైద్యాధికారులు ఎం.గంగునాయుడు, సామాజిక వైద్య అధికారి సాంబమూర్తి పాల్గొన్నారు.

రూ.1.88 కోట్లతో కొండవాలులో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తాటిచెట్లపాలెం: భీమిలి నియోజకవర్గ పరిధి 45వ వార్డు సత్యసాయినగర్‌లో శుక్రవారం జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ శివారు, కొండవాలు ప్రాంతాల ప్రజలకు మౌలిక సదుపాయాలను అందజేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయించిందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ వార్డు ప్రజల సంక్షేమానికి వివిధ పథకాల ద్వారా ఐదేళ్లలో సుమారు రూ.100 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. సత్యసాయినగర్, సింహగిరి కాలనీ, వరాహగిరి కాలనీల్లో సుమారు రూ.1.88 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మెట్ల నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు రాజుయాదవ్, బాబూరావు, సత్యానందంరెడ్డి, నూకరత్నం, మాత ఈశ్వర్, రవిశంకర్, ఎల్లాజి, కనకరాజు, సన్ని, నానిబాబు, నర్సారావు, జీవీఎంసీ ఏఈ, ఏపీడీ, సీవో, ఆర్పీలు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ అప్రమత్తత అవసరం

ఆర్డీవో భాస్కరరెడ్డి




మాట్లాడుతున్న భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గ పరిధిలో ఎన్నికలు నిర్వహించే విషయంలో అధికారులు, పోలీసులు ఎంతో జాగ్రత్తగా ఉండాలని ఆర్డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారు ఎస్.భాస్కరరెడ్డి సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి సెక్టార్ అధికారులు, పోలీసులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సున్నితమైన, ఇబ్బందులున్న పోలింగ్ స్టేషన్లపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని 359 పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంల పనితీరు సరి చూసుకోవాలని సూచించారు. రాజకీయ నాయకుల విగ్రహాలపై వస్త్రాలను కప్పి ఉంచాలన్నారు. సమావేశంలో మూడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పద్మనాభం: కృష్ణాపురంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి వచ్చేనెల 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని స్పెషలాఫీసర్ గ్రేస్ లిల్లీ తెలిపారు. ఆరో తరగతి, ఇంటర్ ఎంపీసీ గ్రూపులో ప్రవేశాలకు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనాథలు, బడి బయట ఉన్న పిల్లలు, డ్రాపవుట్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షలు ఉండాలన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రితో విద్యార్థులు

భీమునిపట్నం: కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సాయం అందించారు. 26 మందికి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తి కంపాస్ బాక్సులు, అట్టలు, స్కేళ్లు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.